# మాతృత్వపు మధురానందం

నోరుకొండ సత్యానంద్

**ఆ ఇంట్లో** అందరూ నిద్ర పోయారు, ఒక్క అరుణ తప్ప!

అరుణ ఆలోచిస్తోంది. తను ఆశ పడినా, తనకు మిగిలేది నిరాశ అని తెలిసినా ఆ పోటో వైపు చూస్తూ ఆలోచిస్తుంది. అలసిపోయినా ఆలోచిస్తుంది. ఆ ఆలోచనల అంతం కోసం ఆరాట పడుతుంది. ఆరాటపడినా, తనమీద తనే ఆవేశ పడినా తను తీసుకున్న నిర్ణయం తప్ప మరో మార్గం లేదనిపిస్తుంది. తీసుకున్న నిర్ణయం రాజేష్‌కు చెబితే...దాన్ని అతను ఆచరిస్తే... ఆచరణానంతరం తన మనసు ఏమవుతుంది? అనికూడా ఆలోచిస్తుంది.

తన మనసు ముక్కలై పోదూ! ?

మరుక్షణంలోనే మనసు ముక్కలైనా ఈ నిర్ణయమే సబబు అని అనుకుంది. కారణం—తప్పు తనది కాకపోయినా, లోపం తనది. ఈ లోటుకు కారణం తను. అలాంటప్పుడు మనసు నెందుకు ముక్కలు చేసుకోవాలి? భీకర రాక్షసిలా తనను, ఈ ఇంటిని వెక్కిరిస్తున్న లోటు తీరినప్పుడు, దానికి కారణం తన అంగీకారం అయినప్పుడు బాధ ఎందుకు పడాలి? ఈ ఇంటికి లేని ఆనందానికి కారణం తనే అయినప్పుడు, ఆ ఆనందాన్ని సహృదయంతో అందించే దేయి తనదే అయినప్పుడు బాధపడాల్సిన సమయంలో సంతృప్తి పడే అవకాశం తన సొంతం కాదా?

ఈ ఇల్లు కళకళలాడితే, అందరి ముఖాల్లో ఆనందం చిందులేస్తే, దానికి కారణమైన తను కూడా ఆనందపడే అవకాశం రాదా? ఎంతో ప్రేమతో చూసే అత్త మామల దగ్గర, భర్త దగ్గర మరింత ప్రేమను, లేకపోతే కనీసం సానుభూతినైనా అందుకోలేదా? ఇలాగే కొన్నాళ్ళు సాగితే ఆ కొద్దిపాటి సానుభూతైనా తనకు దక్కదేమో?

తాము ప్రేమించే మనిషి వల్ల కలిసవుటానందం అయినా దక్కకపోతే ఎంతటి మంచివారైనా తమ ప్రేమను చంపుకుంటారేమో?

అప్పుడు తన పరిస్థితేమిటి?

తను తీసుకున్న నిర్ణయాన్ని, అభిప్రాయాన్ని, సరిపోని తన దురదృష్టం వాళ్ళకుకూడా పంచిచ్చిన దుఃఖాన్ని చెరిపి వేసే ఆలోచనని వాళ్ళకు తనే ఈ పరిస్థితిలో చెప్పకపోతే...కరుగుతున్న కాలం తనే ఆ విషయాన్ని వాళ్ళ కళ్ళకు చూపిస్తే? వాళ్ళ ఆలోచనల్లో మేలుకొస్తే? వాళ్ళ మెదడు పొరల్లోకి చొచ్చిస్తే?

అప్పుడు...ఇక్కడ...ఈ ఇంట్లో నా స్థానం ఏమిటి?

ఆ ఆలోచనకు ఆగలేకపోతుంది అరుణ.

అందుకే అనుకుంది రాజేష్ రాగానే తన నిర్ణయాన్ని అతనికి చెప్పేయాలని.

రాజేష్ విశాఖపట్నం వెళ్ళాడు ఒక మిత్రుడి పెళ్ళికి. ఆ పెళ్ళి నుండి ఎంత రాత్రైనా వచ్చేస్తానని చెప్పాడు అరుణతో.

ఒక వైపు తను తీసుకున్న నిర్ణయం తరవాతి విషయాల గురించి ఆలోచిస్తూ, మరో వైపు తన మదిలో మెదులుతున్న గతంలోని కొన్ని ఆనందానుభవాలతో కాలక్రమేణా కాలం కొరడాతో గుండె మీద గాయం చేస్తూ, వికటాట్టహాసం చేస్తూ, క్రూరంగా నవ్వుతూ గెంతు లేసిన గతంలోని కొన్ని దుస్సంఘటనలతో సతమతమవుతుంది అరుణ.

• • • •

అరుణను అందంగా, ఆకర్షణీయంగా ముస్తాబు చేశారు. అరుణ తల వంచుకుని కూర్చుంది సిగ్గుతో. అందరూ అక్కడినుండి వెళ్ళిపోయారు. దగ్గరి బంధువు, స్నేహితురాలు అయిన కుసుమ అరుణ వైపు అదోలా నవ్వుతూ చూసింది. కుసుమకు పెళ్ళైపోయి రెండు సంవత్సరాలైంది.

"పెళ్ళికూతురా! ఈ రాత్రి విందు ఎంత కమ్మగా ఉందో ఉదయం నా తోనే ముందు చెప్పాలి. మా అన్నయ్య ఏమన్నాడో, ఏం చేశాడో అబద్ధాలు ఆడకుండా, ఏమీ దాచకుండా చెప్పాలి తెలుసా?" అంది నవ్వుతూ కుసుమ.

"ఛీ! పోవే!" అని సిగ్గును కప్పి పుచ్చుతూ కోపాన్ని అభినయిస్తూ తని తలెత్తింది.

తలార స్నానం చేశాక లూజుగా వేసిన జడతో, ఆ జడలో మత్తెక్కించే వాసనను వెదజల్లే మల్లెపూల దండతో, అందమైన పెళ్ళి బొట్టుతో, విల్లులా వంగినట్లున్న కనుబొమలతో, సిగ్గుతో బరువెక్కిపోయి వాలిపోయిన కనురెప్పలలోంచి అందంగా కనిపిస్తున్న కలువరేకుల కళ్ళతో, నాజూకైన నాసికతో, దొండపండు పెదవులతో, కెంపులు పొదిగినట్లున్న గుండ్రని బుగ్గలతో, ముద్దొచ్చే చుబుకంతో, తెల్లని చీర, జాకెట్టుతో ఏవో అందాలను కొత్తగా సంతరించుకున్న అరుణను చూసి ముచ్చట పడి తృప్తిగా నవ్వుకుంది కుసుమ.

మరో అరగంటలో అరుణను ఆ గదిలోకి తోశారు ముత్తైదువలు. మరుక్షణంలో తలుపు వేసిన శబ్దం! ఎందుకో ఉలిక్కి పడింది అరుణ.

గదిలో... రాజేష్...

అందంగా నవ్వుతూ, ప్రేమ పూరిత కాంతిపుంజ ప్రసారిత నేత్ర ద్వయంతో చూస్తూ అరుణ దగ్గరకు వచ్చాడు.

• • • •

అరుణ గుండె బరు వెక్కిపోయింది. ఆమె కళ్ళ వెంట కన్నీటి ధార ఆగడం లేదు. ఆపుకునే ప్రయత్నం కూడా చేయలేక పోతూంది.

"ఆం. రిక్షాలు వచ్చేశాయి. బస్సుకుకూడా టైమైపోతుంది. పదండి, పదండి. ఇంకా ఆలస్యం చేస్తే వర్జ్యంకూడా వచ్చేస్తుంది" అని అన్నా రెవరో.

అరుణ ఇంతసేపూ బిగపట్టుకుని ఆపుకున్న ఏడుపును ఇంక ఆపుకోలేకపోయింది. పక్కనే ఉన్న తల్లిని కౌగిలించుకుని వెక్కి వెక్కి ఏడ్చేసింది. అరుణ చెల్లెళ్ళు, మిగిలిన వాళ్ళుకూడా ఏడ్చేశారు.

అరుణ తండ్రి కళ్ళలోంచి రెండు కన్నీటి చుక్కలు నిశ్శబ్దంగా జారిపోయాయి.

అంతలో ఎవరో అరుణ చేతిని పట్టుకున్నారు. తలెత్తి చూసింది.


రాజేష్! మౌనంగా ఉన్న కళ్ళతోనే అన్నాడు "రా" అని.

బస్సు కదిలింది. అరుణ కిటికీ వేపు కూర్చుని ఉంది బయటికి చూస్తూ. పక్కన రాజేష్ కూర్చున్నాడు. ఆమె కిప్పుడు గుండె కాస్త తేలిక పడినట్లనిపించింది. ఆమెకు తల్లి అన్న మాటలు మరొక్కసారి గుర్తొచ్చాయి.

"ఆడదాని జీవితంలో అసలైన, అవసరమైన, అందమైన మలుపు వివాహం. ఆ మలుపులో ఆమె నడిచే తీరులోనే ఆమె ముందు జీవితంలోకి తొంగి చూపే అందాలు ఆధారపడి ఉంటాయి. అత్త మామలంటే తల్లి తండ్రులు. ఆడపడుచు లంటే అక్కా చెల్లెళ్ళు. ఇక భర్త అందరినీ మించిన దైవం. ఎదుటి వారి మనస్తత్వం ఎంత క్రూరమైనా, ఘోరమైనా భరించే సహనం ఆ మనస్తత్వానికి ఎదురు పడితే అది మెత్తగా మారిపోతుంది. తెలిసి మసలుకుంటే అందమైన బంధాలు మనల్ని పెనవేస్సుకుంటాయి."

• • • •

ఆ ఇల్లు అత్తవారిల్లులా లేదు అరుణకు. కారణం—ఆమెను అత్త మామలు కన్నకూతురి కంటే ఎక్కువగా చూసుకుంటున్నారు. ఆడపడుచులు సొంత అక్కలాగే చూసుకుంటున్నారు.



"పెళ్ళై ఆడపిల్లలు వెళ్ళిపోతే చివరి వరకూ మాతో ఉండే కూతురు కోడలే కదమ్మా! నీ కడుపున కాసిన కాయలు మాకు తెచ్చి, ఆడించి, ఆనందింప జేస్తే మా కంతకంటే కావాల్సింది ఏముందమ్మా?" అనేవారు మామగారు.

"ఎన్ని కష్టాలు పడ్డానమ్మా వాడితో? ఒక్కడే కొడుకని గారాబం చేసే వారు విూ మామగారు. ఆ గారాబంతో వాడు చెడిపోతాడేమోనని భయపడే దాన్ని నేను. కాని వాడు గారాబంలోకూడా సంస్కారాన్ని సంపాదించుకున్నాడు. తెలివి తేటలతో చదివి ఈ నాడీ స్థితిలో ఉన్నాడు. వెళ్ళిపోయే కూతుళ్ళెంత మంది ఉంటే ఎందుకమ్మా? మాతో ఉంటూ, మా చివరి దశలో చేయందించే కొడుకు, కోడలు, మనమళ్ళు, మనమరాళ్ళు ఉండి, వాళ్ళు ఆనందంగా, ఆరోగ్యంగా ఉంటే చాలమ్మా మాకు" అనేవారు అత్తగారు.

వాళ్ళ మాటలకు అరుణ ఎంతో ఆనందపడి, తనెంతో అదృష్టవంతురాలినని పొంగి పోయేది.

మరు సంవత్సరంలో పెద్ద ఆడపడుచు వివాహం జరిగిపోయింది.

• • • • •

ఆ రోజు అరుణకు తల తిరిగి నట్టయింది. మరు నిమిషంలో పెద్ద వాంతికూడా చేసుకుంది అత్తగారు అరుణ తల పట్టుకుని తలను, వీపుని నిమిరారు ప్రేమగా. తరవాత వెంటనే దగ్గరలో ఉన్న లేడీ డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్ళారు. డాక్టరమ్మ చెప్పిన మాటకు అరుణ అత్తగారు, మామగారు ఎంతో పొంగిపోయారు. ఇంటికి వచ్చిన కొద్ది సేపట్లో రాజేష్‌కూడా వచ్చాడు.

కొడుక్కి ఎదురొచ్చి "ఒరే, బాబూ! నీ కో శుభ వార్త. ముందు నోరు తెరు, చెబుతాను" అన్నారు అరుణ అత్తగారు నవ్వుతూ.

"ఏమిటమ్మా?" అని అంటూ నోరు తెరిచాడు రాజేష్.

తల్లి నోట్లో పంచదార వేసి "మరేమో నువ్వు. అహా నేను నానమ్మను కాబోతున్నానురా" అం దామె. ఆ మాట విని రాజేష్ పొంగుతున్న ఆనందాన్ని అదుపులోకి తెచ్చుకుంటూ మెరిసే కళ్ళతో భార్య వైపు చూశాడు.

అరుణ సిగ్గుపడి అక్కడ నుండి వెళ్ళిపోయింది.

"ఒరే బాబూ! ఇప్పటినుండీ అమ్మాయిని జాగ్రత్తగా చూసుకోవాలి మనమంతా. రోజూ ఆఫీసు నుండి పళ్ళు తీసుకొస్తుండు! అమ్మాయి అడిగినవి నేను వండి పెడతాను. డాక్టరమ్మ వ్రాసిచ్చిన మందు లన్నీ తీసుకురా. మనుమడు బంగారు బాబు లాడుండాలి. ఆ!" అంది మురిసిపోతూ తల్లి.

తల్లి మాటలకు ముసిముసిగా నవ్వుకున్నాడు రాజేష్.

తరవాత అరుణ దగ్గరకు వెళ్ళి "ఇదిగో, కోడలు పిల్లా! ఈ వేళనుండీ నువ్వేమైనా పని చేశావంటే వూరుకునేది లేదు. తరవాత నీరసం అనీ, అదనీ, ఇదనీ అంటే, నీ వాళ్ళు నన్ను ఆడిపోసుకునే అత్తగారు అని ఆడిపోసుకుంటారు. ఏం కావాలన్నా మొహమాట

పడకుండా పన్నడుగు. ఇవన్నీ చెబుతూంది నీ కోసం కాదు, నా మనవడి కోసం!'' అంది ఆమె.

ఆ అత్తగారిలో అమ్మను మించిన అమ్మ కనిపించింది అరుణకు.

• • •

అరుణకు ఒక్కసారిగా పిచ్చెత్తి నట్టయింది ఆ మాట విని. ఆమె గుండె మోయలేనంత బరువుగా తయారయింది. కళ్ళు తిరుగుతున్నట్లుగా, ఈ లోకం అంతా తన వైపు చూసి కసిగా నవ్వుతున్నట్లుగా అనిపించింది.

ఆ రోజు...

చంకలో పిల్లడు, ఒడిలో పిల్లడితో బాధపడుతున్న శారద ''వదినా! ఒక్కసారిలా వస్తావా. వీడ్ని కాస్త ఎత్తుకో! చిన్నాడికి పాలు పడతాను'' అని పిలిచింది అరుణను.

అరుణ శారద దగ్గరకు వెళ్ళి చంకలో బాబుని ఎత్తుకుని ముద్దాడుతూ ''మా అన్నయ్య పోలికలే అన్నీను. ఎలా చూస్తున్నాడో చూడు నా వైపు?'' అంది.

ఆ మాటకు ''ఏం ముద్దు రావడమో కానీ, ఈ పిల్లలు చంపేస్తున్నా రనుకో! నిజానికి నీదే అదృష్టం హాయీను. పిల్లలతో బాధపడే దురదృష్టం తప్పింది'' అంది శారద.

''ఏమిటి శారదా, నువ్వంటున్నది?'' అంది అరుణ.

శారదకు గుర్తొచ్చి నాలిక్కొరుచుకుని, ''అబ్బే! ఏం లేదు. ఊరికే. ఆ. ఊరికే వదినా! హాస్యానికి అన్నాను.'' కంగారు కంగారుగా అంది.

ఆ మాటలు, కంగారు అరుణకు అనుమానాన్ని కలిగించాయి. చాలావరకు విషయం అర్థమైపోయింది. ఆమె నోటివెంట మాటలు రాలేదు. పరుగు పరుగున తన గదిలోకి వెళ్ళి మంచం మీద వాలిపోయింది.

కన్నీళ్ళన్నీ కారిపోయినా ఆమె గుండెలో బరువు తగ్గలేదు.

సాయంత్రం వరకూ ఆమె అలాగే, ఆ గదిలోనే ఆ మంచం మీద పడుకుని ఉండిపోయింది. శారద విషయాన్ని తల్లికి చెప్పింది. ఎంత పనిచేశావని కూతుర్ని తిట్టి పోసింది. కానీ, కోడలు దగరకు వెళ్ళడానికి ధైర్యం చాల్లే దామెకు. భర్త వచ్చాక అతనికి చెప్పింది రాజేష్ తల్లి. ఎంతో కష్టపడి ఈ విషయాన్ని దాచాం. నువ్వొచ్చి ఎంత పని చేశావే? అని కూతుర్ని తిట్టారు. అరుణ ఎంత బాధ పడుతుందోనని ఎంతో నొచ్చుకున్నారు.

సాయంత్రం రాజేష్ వచ్చి హడావుడిగా స్నానం చేసి ''అలా ఉన్నావేం అరుణా! నే నొచ్చే సరికి రెడీగా ఉండమని చెప్పానా? బీచ్‌కి వెళదాం అని అన్నానా?'' అన్నాడు అరుణతో.

''తయారవుతాను. ముందు మీరు కాఫీ తాగండి'' అని కాఫీ కప్పు అందించింది.

పది నిమిషాల్లో అరుణ తయారయింది. ఇద్దరూ బీచ్‌కి వెళ్ళారు.

''రా అరుణా! క్వాలిటీలో టిఫిన్ చేసి వచ్చి కూర్చుందాం!'' అన్నాడు రాజేష్.

''వద్దండి. ఇప్పుడేగా కాఫీ తాగాం. అక్కడ కూర్చుందాం రండి'' అంది దూరంగా ఎవ్వరూ లేని ప్రదేశాన్ని చూపిస్తూ.

ఇద్దరూ నడుస్తున్నారు. రాజేష్ అరుణ భుజం మీద చేయి వేశాడు. అరుణ తల దించుకుని నడుస్తోంది.

''ఏం అరుణా! ఈ రోజు ఇంత డల్‌గా ఉన్నావు?

దించుకున్న తలను ఒక్కసారి పైకెత్తి రాజేష్ వైపు చూసింది. ఆందోళన లాంటిది మిళితమై ఉంది రాజేష్ నవ్వు ముఖంలో.

''ఇక్కడ కూర్చుందాం రండి'' అంది అరుణ.

తెల్లని చీర కొంగును భుజాల మీదుగా కప్పుకుని ఒదిగి కూర్చుంది అరుణ. రాజేష్ ఆమెకు దగ్గరగా భుజం చుట్టూ చేయి వేసి కూర్చున్నాడు.

''ఏం అరుణా? డల్‌గా ఉండడానికి ఏమైనా కారణం ఉందా?''

''ఆఁ. ఉండే ఉంటుంది.''


''ఏమిటా జవాబు?'' అర్థంగాక చిన్నగా నవ్వుతూ అడిగాడు.

''ఏమండీ! నే నో విషయాన్ని అడుగుతాను. దాచకుండా చెబుతారా?''

''నీ దగ్గర నేనేం దాస్తాను? అడుగు, చెబుతాను.''

''నాకు పిల్లలింక పుట్టరా?''




ఆ ప్రశ్నకు దిగ్భ్రాంతిగా చూశాడు అరుణ వైపు. రాజేష్ ఏమీ మాట్లాడలేదు.

"మాట్లాడరేమండీ?"

"ఇలాంటి పిచ్చి ప్రశ్నకు నేనేం సమాధానం చెప్పగలను?"

"దాచిన నిజాన్ని చెప్పండి చాలు."

"నిజం ఏమిటి? దాన్ని నేను దాచడం ఏమిటి?"

"తెలివిగా తప్పించుకోకండి. నా కంతా తెలుసు."

"ఏం తెలుసు, అరుణా? నీ కేమైనా పిచ్చి పట్టిందా?"

"అవును. పిచ్చే పట్టింది— శారద మాటలు విన్నాక."

అదిరి పడినట్లు చూశాడు రాజేష్. "శారదా? ఏం చెప్పింది?"

"పిల్లలు పుట్టక పోవడమే నా అదృష్టం అని... ఏమండీ? చెప్పండి. నా కేమయిందో చెప్పండి. శారద మాటలు విన్న ఆ క్షణం నుండీ నే నెంత నరక యాతన అనుభవిస్తున్నానో మీకు తెలీదు. పిచ్చి పూవులైనా పూయని పిచ్చి మొక్కకు, సంతానం లేని ఆడదానికి విలువే ముంటుందండీ? శారద మాటలకు అర్థం ఏమిటి? నా కింక పిల్లలు పుట్టక పోవడానికి కారణం ఏమిటి?"

ఆ ప్రశ్నలు అడుగుతుంటే అరుణ కళ్ళలోని నీళ్ళు అదుపు తప్పి చెంపల మీదుగా జాలువారాయి. ఆమెను అలా చూసిన రాజేష్ ఒక్క క్షణం చలించి పోయాడు.

ఆమెను మరింత దగ్గరకు తీసుకుని "అరుణా! పూలు పూయని అందమైన మొక్కలు ఎన్ని లేవు? నిన్ను అర్థం లేకుండా మాట్లాడే వా రెవరూ లేరు మా ఇంట్లో. అందరూ నీ సంతోషం కోసం ఆరాటపడే వారే!" అన్నాడు.

అరుణ కన్నీళ్ళ కళ్ళతో అదోలా చూసింది రాజేష్ వైపు.

"అంటే... నే నీ జన్మలో తల్లిని కాలేనా?"

తల దించుకున్నాడు రాజేష్.

"ఏమండీ! చెప్పండి. ఎందుకు నా కా అదృష్టం లేదు?"

భారంగా నిట్టూర్చాడు రాజేష్.

"అప్పుడు నీకు ప్రసవం కష్టమైంది. నిన్ను కష్ట పెట్టి మృత్యుముఖం లోకి తీసుకువెళ్ళి పెద్ద ఆపరేషన్ చేశాక కానీ పుట్టని బాబు పుట్టిన గంటలోనే పోయాడు. మళ్ళీ నీవు గర్భం ధరిస్తే, మళ్ళీ ఇలాగే ప్రసవం కష్టమైతే నువ్వింక మాకు దక్కినా దక్కొచ్చు, దక్కక పోయినా దక్కక పోవచ్చు అని డాక్టర్లు పదేపదే చెప్పారు. అందుకే నీ కోసమే నీకు పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేసేశారు. ఆ విషయం తెలిస్తే నీవు బాధ పడతావని నీకు తెలియ నివ్వలేదు."

అలిసిపోయినట్లుగా ఒక్కసారి ఆగాడు రాజేష్.

భర్త వైపే తదేకంగా, అదోలా చూసింది అరుణ.

"అరుణా! నీ వీ విషయాన్ని పట్టించుకోకు. నిన్నెవ్వరూ ఏమీ అనరు. ఎవరైనా ఏమైనా అన్నా, చులకనగా మాట్లాడినా నాకు చెప్పు. వాళ్ళకు సరైన బుద్ధి చెబుతాను. ఈ విషయంలో నీ తప్పు లేదు. దేవుడే మనల్ని చిన్న చూపు చూశాడు. నాలో సంస్కారం ఉందని నువ్వు గ్రహిస్తే ఎప్పుడూ బాధ పడకు. కంట తడి పెట్టకు" అన్నాడు లాలనగా ఆమె చెంపల మీది కన్నీటిని తుడుస్తూ.

ఆ మాటలకు అరుణ ఆగలేకపోయింది. భర్త ఒడిలో తల పెట్టి ఒక్కసారిగా ఏడ్చేసింది.

● ● ● ●

గడియారం పదకొండు గంటలు కొట్టింది.

ఆగని కన్నీటి ధార తలగడను తడిపేస్తోంది. ఆ ఫొటోలో నవ్వు అలాగే ఉంది. అరుణకు ఆ నవ్వు మాసిపోదని తెలుసు, అది ఆమె సొంతం కాదని తెలుసు.

అందుకే ఆలోచిస్తోంది. ఆలోచిస్తూ గతాన్ని గుర్తు చేసుకుంటుంటే తయారవుతున్న నిర్ధారణ బరువెక్కిన ఆమె గుండెను నెమ్మదిగా తేలిక పరుస్తోంది. అయినా ఆగని ఆలోచనలు ఆమెను ఇంకా వేధిస్తున్నాయి.

తనెంత దురదృష్టవంతురాలు?

ఇరుగు పొరుగు వారు అవకాశం దొరికినప్పు డల్లా ఏదో విధంగా మనసు మీద గాయాలు చేస్తున్నా దేవుడు ప్రసాదిస్తున్న దురదృష్టానికి దుఃఖిస్తూ, ఆ గాయాలతో బాధ పడాల్సొస్తుందే తప్ప, తనేమీ చేయలేకపోతూంది.

ఈ ఇంట్లో లేని ఆనందానికి తనొక కారణంగా మారిపోవాల్సిందేనా? ఆ ఆనందం వచ్చే మార్గానికి అడ్డు తప్పుకోవాల్సిన అవసరం తనకు లేదా?

ఉంది. ఎవరో లోలోపలనుండి అన్నట్లనిపించింది.

అడ్డు తప్పుకోవడమంటే? అరుణకు ఏదో స్ఫురించింది.

పిచ్చిదానా! మీ ఇంటి ముందు వారి కోడలు రాధకు పిల్లలు పుట్టినా, మగపిల్లలు పుట్టని కారణంగా ఆమెను ఆ ఇంట్లో వాళ్ళందరూ ఎలా హింసిస్తున్నారో చూశావా? ఆమె కంటే నీ వెంత అదృష్ట వంతురాలివో ఆలోచించుకో. ఈ ఇంట్లో వారెవ రైనా నిన్ను ఏ విధంగానైనా బాధ పెడుతున్నారా?

లేదు.

అలాంటప్పుడు ఇంతవరకూ ఒక చక్కని నిర్ధార ణకు వచ్చి, ఈ క్షణంలో బేలలా, పిరికిదానిలా చచ్చిపోవాలనుకుంటున్నావా? ఆత్మహత్య మహాపాపం! ఆ పాపాన్ని మోస్తూ ను వ్వే లోకంలోనూ హాయిగా ఉండలేవు. అందుకే నేను చెప్పినట్లు చేయి. నీవు తీసుకున్న నిర్ణయం సరియైనది. ఆ నిర్ణయాన్ని రాజేష్‌కు చెప్పు! అత నాచరించేలా చేయి. దేవత ల్లాంటి ఈ ఇంటి మనుష్యుల మధ్య ప్రేమాను రాగాలతో ఆనందంగా నీ జీవితాన్ని గడుపుకో.

గజి బిజి ఆలోచనలతో, మళ్ళీ ఏం చేయాలో అర్థంకాని సందిగ్ధ స్థితిలో అరుణ పిచ్చెత్తి పోతున్న సమయంలో ఎవరో తలుపు తట్టిన చప్పుడు వినిపించింది.

రాజేష్... ఆయనే వచ్చుంటారు అనుకుని అంతు లేకుండా సాగిపోతున్న ఆలోచనల్ని ఆపుకుని, ముఖాన్ని తుడుచుకుని వెళ్ళి తలుపు తీసింది అరుణ.

వచ్చింది రాజేష్! చేతిలో ఉన్న బ్రీఫ్‌కేస్‌తో, అలసి, వాడి నట్లున్న అతని ముఖంలో చెరగని చిరునవ్వుకూడా ఉంది. లోపలకు వస్తూ "ఏం అరుణా? ముఖం అలా ఉందేం? ఇంకా నిద్ర పోలేదా?" అని అడిగాడు.

"ఏం లేదు. మీ కోసమే ఎదురు చూస్తున్నాను." తెచ్చి పెట్టుకున్న నవ్వు నవ్వుతూ అని రాజేష్‌ను అనుసరించింది.

"అందరూ పడుకున్నారా? నువ్వు భోజనం చేశావా?" బూట్లు విప్పుతూ అన్నాడు.

"పడుకున్నారు. నేను అత్తయ్యతోనే భోజనం చేశాను." ఇంకా భోజనం చేయలేదంటే రాజేష్ కోప్పడతాడని అబద్ధం ఆడింది అరుణ. ఆలోచనలు అరుణ ఆకలిని చంపాయి.

రాజేష్ స్నానం చేసి వచ్చేంతలో భోజనం వడ్డిం చింది అరుణ.

పెళ్ళి విషయాలన్నీ సరదాగా చెబుతూ భోజనం ముగించాడు రాజేష్.

రాజేష్ మెత్తని పరుపు మీద మేను వాల్చాడు. వెళ్ళి అతని పక్కన కూర్చుంది అరుణ.

"నిద్ర రావడం లేదా, అరుణా?"

"లేదు."

"ఎందుకనో?" అని నవ్వుతూ ఆమె నడుం చుట్టూ చేయి వేశాడు.

అరుణ విడిపించుకోవడానికి ప్రయత్నించ లేదు. అతని గుండె మీద వాలిపోయింది.

"మీ ముఖం చూస్తుంటే బాగా అలసిపోయినట్లున్నారు. నిద్రొస్తూందా?"

"నువ్వు ఇలా గుండె మీద ఉండి ఉండకపోతే ఈ సరికి నిద్ర వచ్చేసేదే."

అరుణ సిగ్గు పడుతూ తలగడ మీద తల పెట్టి పడుకుంది.

"అరుణా! మా ఫ్రెండ్ పెళ్ళి చూస్తుంటే నాకు మన పెళ్ళే గుర్తొచ్చిందనుకో."

చిన్నగా నవ్వింది అరుణ.

అరుణ దృష్టి ఎదురుగా ఉన్న ఫోటో మీద పడింది.

'అరుణా' అని పిలిచినా పలక్కపోవడంతో పక్కకు తిరిగి చూశాడు రాజేష్. ఆమె ఎటు వైపు చూస్తూందో తెలిసింది. ఆమె ఇప్పుడు ఏం ఆలోచిస్తూందో కూడా అర్థమైంది.

"మళ్ళీ అనవసరపు టాలోచనలు ఆలోచిస్తున్నావా? నీ కెన్ని సార్లు చెప్పాను ఇంక ఆ విషయం గురించి ఆలోచించద్దని? నా కోసమైనా సరదాగా ఉండలేవా?"

అరుణ రాజేష్ కళ్ళలోకి చూసింది. ఆమె చూపులో ఏదో మార్పు ఉందని గ్రహించాడు రాజేష్.

"ఎలా ఉండగలనండీ? పెద్ద దారుణానికి కారణం నేనై, నవ్వుతూ ఎలా ఉండనండీ?"

"దారుణం ఏమీ కాదు. నువ్వలా వూహించుకుంటున్నావు— అంతే!"

"మీది మంచి మనసు. ఆందోళన పడేవారికి ఓదార్పు చూపే మనస్తత్త్వం మీది. మీకు మాత్రం బాధగా లేదా?"

"బాధ... ఎందుకు, అరుణా, నువ్వు పదే పదే అదే విషయం గురించి ఆలోచిస్తున్నావు?" స్వరం పెంచి అన్నాడు.

"ఆలోచించకుండా ఉండలేక పోతున్నానండీ."

"గుండెను రాయిలా చేసుకోవాలి, అరుణా."

"గుండె రాయిగా ఎప్పుడో మారిపోయింది. నా ఆలోచనల్ని నేనాపుకోలేను. ఆలోచనల బలమైన తాకిడికి నా గుండె బద్దలై పోకుండా ఉండాలంటే మీరు నా కో సహాయం చేయాలి."

భృకుటి ముడిచి భార్యవైపు చూసి "ఏమిటి, అరుణా?" అన్నాడు.

"మీరు మళ్ళీ పెళ్ళి చేసుకోండి!"

ఒక్క నిమిషం అరుణ వైపే చూశాడు రాజేష్. అరుణ కళ్ళు సజలమైనాయి.

"ఎవరైనా నిన్నేమైనా అన్నారా? నేను మరో పెళ్ళి చేసుకుంటే బాగుండునని మా ఇంట్లో చాటుగా అనుకుంటున్నారా?" ఏమైనా జరిగిందేమోనని, జరిగిందేమిటో తెలుసుకోవాలనుకున్నట్లుగా అడిగాడు.

"లేదండి. ఈ ఇంట్లో వారంతా దేవతలు. ఎవ్వరూ నన్నేమీ అనరు. కానీ, నేనే... నాకే ఈ ఆలోచన వచ్చింది."

"నువ్వు మనఃస్ఫూర్తిగా అంటున్నావా ఈ మాట?"

అరుణ మనసు రెండో వైపు నుండి తొంగి చూసింది. రాజేష్ అన్న ఆ మాట తరవాత అతను అనబోయే మాటను అస్పష్టంగా తెలియ జేస్తున్నాయి. అయినా అరుణ ఆగలేదు. "అవునండీ— మీరు నా భర్త. మీకు పుట్టిన పిల్లలు నా పిల్లలు కారా? మన కా అదృష్టాన్ని తెచ్చి పెట్టే అమ్మాయి నా చెల్లెలు కాదా? మన ఇల్లు బుజ్జి బుజ్జి పాపాయిలతో కలకల లాడితే నాకు మాత్రం ఆనందం కాదా?"

రాజేష్ ఒక నిమిషం మౌనంగా ఉండి ఆ తరవాత "సర్లే! నువ్వంతగా అంటుంటే కాదని నీ మాటను తీసి పారెయ్యలేను. ఆలోచిద్దాం లే!" అని పక్కకు తిరిగి పడుకున్నాడు.

లోపల్నుంచి ఎవరో వికృతంగా వికటాట్టహాసం చేస్తున్నట్లు అనిపించింది అరుణకు.

'చూశావా?' నీ భర్త అన్న మాటకు అర్థం ఏమిటి? ఏమిటో ఆలోచించావా? రాజేష్ మగవాడు. అందుకే అలా అన్నాడు. అంటే అతను ఈ అవకాశం కోసమే

పెరిగే సంవత్సరాలు ఎంతో
సుకుమారం ఇప్పుడు మీ పాపాయి
గురించి ప్రత్యేకమైన శ్రద్ధ తీసికోవడం
వహించడం అత్యవసరం.

పింకూ గ్రైప్ వాటర్
మీ పాపాయి
జీవితానికి ఒక
ఆరోగ్యవంతమైన
ఆరంభం.

పింకూ
గ్రైప్ వాటర్

ఇది మీ పాపాయి గురించి శ్రద్ధ
వహించేటట్లు మరేదీ చేయలేదు.
నియమిత రూపంగా పింకూ గ్రైప్
వాటర్ వాడకం మీ పాపాయిని
ఆరోగ్యంగా వుంచుతుంది మరియు
జీర్ణసంబంధమైన అస్వస్థతలనుండి
రక్షిస్తుంది.




A Product of
ajanta pharma pvt.ltd.
Worli, Bombay 400 025.

INNOVATION/AP/TEL/05-A

ఎదురు చూస్తున్నాడన్న మాటే కదూ! ? పాపం! నువ్వో అమాయకమైన ఆడదానివి. అందుకే జీవితాన్ని అర్థం చేసు కోలేక పోయావు. నీ జీవితం ఒక కొనను అతనికి అందించావు. ఇక ఆట ప్రారంభమవుతుంది. నీ జీవితం పతనం కావడం ప్రారంభమవుతుంది. వచ్చే అమ్మాయి నీకు ఏమవుతుందో తెలుసా? నీ వనుకున్నట్లు ఆమె నీ చెల్లెలు కాలేదు. ఆమె నీ శాపానికి ప్రత్యక్ష సాక్ష్యం. ఆ పాత్ర అటువంటిది. ఆ వచ్చే అమ్మాయి దేవత అయితే తప్ప ఆమె నా పాత్రను అలాగే పోషిస్తుంది. నీ పతనాన్ని కాంక్షిస్తుంది. అప్పుడు ఈ ఇంట్లో నీ స్థానం ఏమిటో ఒక్కసారి ఆలోచించు.'

పెద్దగా నవ్వు ... ఘోరమైన నవ్వు ... వింత విపరీత వికటాట్టహాసం!

"అపు! ఇంకేమీ అనకు ... ఇంక నవ్వకు ... నువ్వే కదా అన్నావు నా నిర్ధారణ చక్కనైనదని, సబబైనదని ... మళ్ళీ ఎందు కిలా మాట్లాడు తున్నావు ...?"

"ఆ మాట నే ననలేదు. ఆ మాట అన్నది నీ అంతరాత్మ."

"మరి ... మరి నువ్వెవరు?"

"నేనుకూడా నీ దాన్నే! కానీ, నీ అంతరాత్మ నాకు శత్రువు."

"అందుకే అన్నమాట ఇలా మాట్లాడుతున్నావు."

"కాదు ... నీ వైపు నుండి ఆలోచిస్తూ, నీ భవిష్యత్తును వూహిస్తూ మాట్లాడుతున్నాను. నువ్వో పెద్ద అమాయకురాలివి. అందుకే ఏదో అనుకొని నీ భవిష్యత్తుకు ఘోరం తలపెట్టుకున్నావు. పొరబాటు జారిపోయావు... అన్యాయానికి అవకాశ మిచ్చావు ..."

"అయితే ఇప్పుడు నేనేం చేయాలి?"

"చేసేందు కేమీ లేదు ... ఏం చేసినా నీ స్వార్థం బయటపడుతుంది. దాన్ని ఎవరూ భరించ లేరు. నీ పరిస్థితి అటువంటిది."

"ఇదేమిటి? నే నేమై పోతున్నాను? నాకేమవు తూంది?"


"దీన్నే జీవితం అంటారు... వేసే అడుగు, పలికే మాట, తీసుకున్న నిర్ణయం, వీటిలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అది నీతో ఆడుకుంటుంది. ఆ ఆటలో నిన్నోడిస్తుంది ... అనుభవించు ... ఇక తప్పదు!"

అరుణ గుండె జారిపోయినట్లయింది. ముఖం నిండా చెమట పట్టేంచి శరీరం వణికిపోతూంది... ఆలోచనలు ఇంక ఆగవని, నిద్ర రాదని తెలిసినా గట్టిగా కళ్ళు మూసుకుంది!

• • • •

తెల్లవారింది ...

ఇంట్లో అందరూ లేచారు ఒక్క అరుణ తప్ప. ఆలోచనలు అలసట కల్గించి ఆమెకు నీరసాన్ని కల్గించాయి. మగత నిద్రలో ఎన్నో కలలు ... అవి తీపి కలలు కావు ... భవిష్యత్తులో జరగనున్న చేదును ముందే చూపిస్తున్న పీడ కలలు ... ఆ కలలకు మొదలు, చివర లేదు. ఎవరో భీకరాకారం తనమీద పడుతున్నట్లు, గొంతు నులిమేస్తున్నట్లు, గుండె చీల్చేస్తున్నట్లు, రక్తాన్ని పీల్చేస్తున్నట్లు ....




భయంతో చాలాసేపు అరిచింది... ఆ అరుపులు పైకి రాలేదు...

ఉలిక్కిపడి లేచింది. ఈ లోకంలోకి వచ్చాక తెప్పరిల్లింది. మంచం మీద నుండి లేచింది. మంగళ సూత్రాల్ని కళ్ళ కద్దుకుంది. తలెత్తి చూసింది. దేవుని ఫోటో మామూలుగా దర్శన మిచ్చింది. కళ్ళు మూసుకుని రెండు చేతులూ ఎత్తి దేవుణ్ణి స్మరించింది ...

ఆ తర్వాత. ఆమె దృష్టి అటు వైపుకి సాగింది.

అక్కడ ఆ ఫోటో లేదు. ఎవరో తీసేసినట్లుంది. అరుణ ఒక్క నిముషం చలించి పోయింది. ఆమె కేమీ అర్థం కాలేదు. మళ్ళీ ఆలోచనలు ఒక్కుమ్మడిగా దాడి చేయ బోయాయి...

కానీ — అత్తగారు వచ్చి "ఏమ్మా, రాత్రి వాడొచ్చేవరకూ నిద్రపోకుండా ఉన్నావా? బాగా అలసిపోయా వనుకొని లేపలేదులే, ముఖం కడుక్కొని రా ..." అని అనడంతో అవి ఆగిపోయాయి.

అత్తగారు ఆ ఫోటో లేకపోవడం గమనించలేదు.

అరుణ బాత్‌రూమ్ వైపుకి నడిచింది.

• • • •

అరుణ ఇంట్లో పని చేస్తూంది. ఎంత వద్దను కున్నా ఆమె ఆలోచించకుండా ఉండలేకపోతుంది. అరుణ ముఖంలోని మవునం,ఏదోఆలోచిస్తున్నట్లుగా ఉండడం అత్తగారు గమనించకపోలేదు ... కానీ ఎవ్వరూ ఏమీ అడగలేదు...

వాళ్ళ మాటల్లో తెలిసింది రాజేష్, అతని తండ్రి కలిసి పని ఉందని ఉదయమే లేచి బయటకు వెళ్ళారని ...

"నువ్వు రెస్టు తీసుకోవమ్మా! నీరసంగా ఉన్నావు. పనులు మేం చేసుకుంటాంలే!" అన్నారు అత్తగారు అరుణతో.

అరుణ ఏమీ అనకుండా తన గదిలోకి వెళ్ళి మంచం మీద వాలిపోయింది.

ముసురుతున్న ఆలోచనలు ఆమె మెదడుమీద దాడి చేసి ఆందోళన కలిగిస్తున్నాయి... ఆందోళన ఆమెలో ఆత్రుతను సృష్టిస్తూంది. కాలం గడుస్తున్న కొద్దీ ఆమెను విపరీతమైన నీరసం ఆవహిస్తూంది.

కన్నీళ్ళింకిపోయిన కళ్ళతో ఆమె బల్లిలా మంచానికి అంటుకుపోతూంది.

ఆ సాయంత్రం అత్తగారు, ఆడపడుచు గుడికి బయలుదేరారు. అరుణను రమ్మన్నారు గానీ అరుణ నీరసంతో వెళ్ళలేకపోయింది.

"సర్లే, అరుణా! ఇంట్లో ఉండు. మీ మామగారు, రాజేష్ వస్తారేమోకూడా. అందరూ వెళ్ళితే తాళాలు వెయ్యడం అదీ చేయాలి" అని కూతుర్ని తీసుకుని వెళ్ళిపోయిం దావిడ.

అరగంట గడిచింది ...

కాలం తనను కాటేస్తున్నట్లు, తనేదో భీకర ప్రళయ ప్రవాహంలో కొట్టుకుపోతున్నట్లు ఉంది అరుణకు...

అంతలో వీధి తలుపు ఎవరో కొట్టినట్టు చప్పుడైంది...

'అత్తగారూ వాళ్ళు అప్పుడే వచ్చేశారా?' అనుకుంటూ వెళ్ళి తలుపు తీసింది అరుణ.

ఎదురుగా మామగారు కనిపించారు. ఆయన అరుణవైపు సంతోషంగా చూసి లోపలకు వెళ్ళి పోయారు.

ఆ వెనుక ఉన్న రాజేష్‌ను చూసి ఒక్కసారిగా చేష్టలుడిగిన దానిలా అయిపోయింది అరుణ.

రాజేష్ చేతిలో బేగ్ ఉంది... అతని భుజంమీద సంవత్సరం కూడా నిండని ఓ అందమైన బాబు పడుకొని ఉన్నాడు.

రాజేష్ అరుణ వైపు చూసి 'అలాఉండిపోయావేం, అరుణా! లోపలకు రా!" అని తమ గదివైపుకు దారితీశాడు.

తడబడుతున్న అడుగులతో, పరుగులాంటి నడకతో భర్తని అనుసరించింది...

భుజం మీద ఉన్న బాబుని మంచం మీద వేసే సరికి బాబు లేచాడు. బాగ్ లోంచి పాలసీసాను తీసి బాబు నోట్లో పెట్టాడు రాజేష్.

బాబు పాలు తాగుతూ అందరి వైపూ అందంగా

నవ్వుతూ చూస్తూ చేతుల్ని తప తప కొడుతూ పాలు తాగుతున్నాడు.

అలా ఆ బాబుని చూసిన అరుణ హృదయం ఉప్పొంగి పోయి బాబు దగ్గరకు వెళ్ళబోయి ఒక్క సారిగా ఆగిపోయింది.

రాజేష్ చిన్నగా నవ్వుతూ ... "ఆగిపోయావేం, అరుణా! కోరికను, ప్రేమను, వాత్సల్యాన్ని ఆపుకోకు— ఈ బాబు మన బాబే! ఎత్తుకో!" అన్నాడు.

అరుణ ఎన్నో అడగా లనుకుంది. కానీ, ఆమె నో రెందుకో పెగలలేదు. అయినా అతి కష్టంమీద అడిగింది—"ఈ బాబు ఎవరు?" అని.

"చెప్తున్నా కదా? మన బాబే! ఆలోచనలతో, ఆందోళనతో, భరించలేని ఆవేదనతో నువ్వు తీసుకున్న నిర్ణయానికి ప్రతిరూపం ఈ బాబు."

"నేను తీసుకున్న నిర్ణయం ఇది కాదు..."

"కాకపోవచ్చు ... కానీ, ఆ నిర్ణయానికి కారణం ఇదే కదా?"

అరుణ ఏమీ మాట్లాడలేదు. తల వంచుకొని బాబు వైపు చూస్తూ నిల్చుండిపోయింది.

"అరుణా! పిల్లలింక కలగరని తెలిసిన నీ మనసు ఎంత ఆందోళనకు గురి అయిందో నాకు తెలుసు. అందుకు నీవు తీసుకున్న నిర్ణయానికి, కోరిన కోరికకు నేను చలించిపోయాను. అప్పటికి అలాగే అన్నాను కానీ, నే నలా చేయగలనా? నా అరుణకు జీవితాంతం శిక్ష వేయగలనా? అందుకే నీవు ఎంతగానో ప్రేమించే ఫోటోలోని బాబు పోలికలున్న బాబుని నీ బాబుగా చేద్దామని ఉదయం ఆ ఫోటోని తీసుకొని అనాథ శరణాలయానికి వెళ్ళాను. నా ఉద్దేశానికి అదృష్టం తోడై, నీవు కోరుకునే బాబులాంటి బాబే నాకు కన్పించాడు. నాన్నగారు కూడా ఎంతో ఆనందించారు. అన్ని కార్యక్రమాలూ తొందర తొందరగా పూర్తి చేసుకొని, బాబుని చూసిన నీ కళ్ళల్లో మెరిసే వింత కాంతిని చూద్దామని, నువ్వు ఆనందంతో పొంగి పోతుంటే నేను మురిసిపోదామని పరుగు పరుగున వచ్చాను ... కానీ, నీ ముఖంలో ఈ మౌనం ఏమిటి? దానికి అర్థం ఏమిటి?"

"....."

"ఈ బాబు నీకు నచ్చలేదా? చెప్పు! లేకపోతే నీకు నచ్చిన మరో బాబుని తెచ్చుకుందాం! చెప్పు, అరుణా, నీ అభిప్రాయం ఏమిటి?"

అరుణ తల ఎత్తి రాజేష్ వైపు చూసింది.

"నాకు నచ్చినా, నేను మెచ్చినా, మీకు పుట్టిన పిల్లల సాటి రారు కదండీ ఈ పిల్లలు? నా కోరిక ఇది కాదండీ—మీరు తండ్రి కావాలి ... మీ వల్ల మీ వంశం నిలబడాలండి ... అదీ నేను కోరిందీ, నాకు సంతృప్తి నిచ్చేదీ!"

రాజేష్ నిట్టూర్చాడు.

"సరే, అరుణా! నీ కోరిక అదే అయితే, ఆ ప్రకారమే నేను చేస్తాను... కానీ, నే నడిగే ప్రశ్నకు మనసు విప్పి సరైన సమాధానం చెప్పు! అప్పుడు నేను నీ కోరికను కాదనను..."

అదోలా చూసింది అరుణ రాజేష్ వైపు...

"చెప్పు, అరుణా! ... నా ప్రశ్నకు సరైన సమాధానం చెప్తావా?"




"చెప్తాను... అడగండి..."

"ఏ దురదృష్టం నాకే వచ్చి ఉంటే, నా వల్ల నీకు పిల్లలు పుట్టి ఉండకపోతే, నేను కోరితే నీవు మరొకరిని కేవలం పిల్లలకోసం పెళ్ళిచేసుకోగలవా?"

ఆ ప్రశ్నకు నవనాడులూ కుంగిపోయాయి అరుణకు. అప్పటికప్పుడే ఆమె కళ్ళలోంచి కన్నీటి ధార చెంపల మీదుగా జాలువారింది. ఆ ప్రశ్న ఆమె మనసుకు తగిలిందేమో విలవిల్లాడిపోయింది ...

"ఏమండీ!" అని మాత్రమే అనగలిగింది.

పరుగున వెళ్ళి రాజేష్ గుండె మీద వాలిపోయి వెక్కివెక్కి ఏడ్చేసింది చిన్నపిల్లలా... ఆమెను అలా చూసిన రాజేష్‌కు కూడా ఏడుపు ఆగలేదు. కానీ బలవంతంగా ఆపుకున్నాడు.

"అరుణా! ఏడవకు ... వూరికే అన్నాను... నా మీద నీ కెంత ప్రేమ ఉందో నాకు తెలుసు ... కానీ నీ మీద కూడా నాకు ప్రేమ ఉందని అంటే ఒప్పుకుంటావా? మనకు పుడితేనే పిల్లలా? పెంచుకున్న వాళ్ళు పిల్లలు కాలేరా? కన్న ప్రేమకంటే పెంచిన ప్రేమ గొప్పది. ఆ ప్రేమ వర్షం చేసుకున్న ఎవ్వరైనా పెంచిన తల్లితండ్రుల్ని దేవతల్లా చూసుకుంటారు. ఆ తల్లితండ్రులకు అంతులేని ఆనందాన్ని కలిగిస్తారు. అలాంటి పిల్లలే, అరుణా, ఎవరికైనా కావాల్సింది! పెంపకం, పరిసరాలే పిల్లల మంచి చెడ్డలకు, గుణగణాలకు కారణా లౌతాయి ... నువ్వు పెంచే, ప్రేమించే బాబు నా బాబు కాదా? ..."

ఇంకా ఎన్నో మాట్లాడాలని ఉన్నా, ఉద్వేగం అతని గొంతుక్కి అడ్డం పడిపోవడంతో ఇంకేమీ మాట్లాడ లేకపోయాడు రాజేష్.

గుండె తేలికైనంతవరకూ ఏడుస్తూ రాజేష్ గుండెమీదే ఉండిపోయింది అరుణ.

బాబు కేరింతలు కొడుతున్నాడు. చిన్న చిన్నగా అందంగా ఏదేదో అంటున్నాడు.

అరుణకు బాబు కంఠం వినిపించి అటువైపుకు చూసింది.

గుండ్రంగా, అందంగా మెరుస్తున్న కళ్ళతో, నవ్వుతున్న బోసి నోరుతో, పాలబుగ్గలతో, తెల్లని లేత శరీరంతో, చిన్న ఉంగరాల తలతో ఉన్న బాబు కాళ్ళను, చేతుల్ని అందంగా వూపుతూ కేరింతలు కొడుతున్నాడు.

ఆ బాబుని అలా చూసిన అరుణ హృదయం ఉప్పొంగి పోయింది. ఆమె మాతృత్వం పొంగి అడ్డుపడి పోయిన ఆలోచనల ఆనకట్టను పెళ్ళగించుకొని పారలిపోయింది...

మరుక్షణంలో అరుణ చేతుల్లో బాబు ... బాబు ముఖంలో పువ్వులాంటి నవ్వు ... అరుణ ముఖంలో అదుపు తప్పిన ఆనందం ... ఎన్నడూ ఆమె ముఖంలో కనిపించని ప్రేమానురాగాల పరిమళ భరితమైన మాతృత్వపు మధురానందం...

ముద్దుల వర్షం కురుస్తూంది బాబు నును మెత్తని బుగ్గల మీద ...

అరుణను అలా చూసిన రాజేష్ గుండెలో కోటి స్వరాల సమ్మేళన సంగీతం ...

ఇదంతా చూస్తున్న రాజేష్ తండ్రి కళ్ళలో ఆనంద బాష్పాలు ...

అంతలో వచ్చారు అరుణ అత్తగారు, ఆడపడుచు గుడినుండి. ★